క్లుప్తంగా

పెళ్లికూతురుగా పార్వతీదేవి ఊరేగింపు



మహబూబాబాద్ రూరల్: మార్వాడీలు అత్యంత పవిత్రంగా భావించే ఘన్ గోర్ పండుగ వేడుకల్లో భాగంగా పార్వతీదేవి అమ్మవారిని పెళ్లికూతురుగా అలంకరించి ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో బ్యాండు వాయిద్యాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. హోలీ పండుగ రోజు నుంచి 16రోజులు గరికలతో శివపార్వతులకు మార్వాడీలు ఇళ్లలో పూజలు చేశారు. ఘన్ గోర్ పండుగ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని మహేశ్వరీ భవన్‌లో నేడు రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రత పీట బహూకరణ



గార్ల: గార్ల సమీపంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి గార్లకు చెందిన ఊరు కొండ పాండు, కల్యాణి దంపతులు ఉగాది పండుగ సందర్భంగా రూ.10వేలు వ్యయంతో టేకు కర్రతో చేయించిన సత్యనారాయణస్వామి వ్రతం మండపం పీటను బహూకరించారు. కార్యక్రమంలో అర్చకుడు రామాచార్యులు, దాసరి తరుణ్, స్వామి, అక్షర పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకుడు తాళ్లూరి హనుమంతరావు ఆధ్వర్యంలో ముస్లింకు బియ్యంతోపాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. డోర్నకల్‌లో 108 సిబ్బందికి కాంగ్రెస్ నాయకుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, సుశీల్‌జైన్ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

ఆర్థికసాయం అందజేత

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఆవుల వెంకన్న అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈమేరకు 2013–14 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.13వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రచన, యాకుబ్‌పాషా, సాయి, రఘు, అశోక్, శ్రీకాంత్, రాకేష్‌లు పాల్గొన్నారు.

ఓం పతాకావిష్కరణ

మహబూబాబాద్ రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకుని ఓం పతాకావిష్కరణ, లోక కల్యాణార్థం వేదమంత్రాలతో యజ్ఞం, దేవయజ్ఞం ఆదివారం నిర్వహించారు. ఆర్య సమాజ మందిరం పక్షాన పతంజలి ప్రాణయోగా ఆరోగ్య సేవా కేంద్రంలో ఆర్యసమాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు నారాయణ ప్రకాష్ లోయ భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేశారు.

ఆలయంలో చోరీ

మరిపెడ రూరల్: యాదవుల ఆరాధ్యదైవం అయిన మల్లన్న ఆలయంలో హుండీ చోరీకి గురైంది. ఈ సంఘటన మండలంలోని వీరారం గ్రామ పంచాయతీ పరిధిలోని శనివారం రాత్రి చోటుచేసుకుంది. యాదవ కులస్తుల కథనం ప్రకారం.. ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని యాదవ కులస్తులైన నలబోతు నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేయడానికి తాళంచెవి తీసుకుని గుడి వద్దకు వెళ్లాడు. గుడి తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి తెరుచుకొని ఉన్నాయి. ఆలయంలోని వెళ్లి చూడగా హుండీ అపహరణకు గురైంది. ఈ విషయాన్ని గ్రామంలోని కుల పెద్దలకు తెలియజేయడంతో వెళ్లి గుడిని పరిశీలించారు. హుండీలో సుమారు రూ.50వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు కుల పెద్దలు వెంకన్న, యాదగిరి, లింగయ్య తెలిపారు.

చోరీకి యత్నం..

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గల కాకతీయుల కాలం నాటి శ్రీరాజరాజేశ్వరి దేవాలయంలో శనివారం అర్ధరాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం ఏకంగా గర్భగుడిలోని గోడలకు డ్రిల్లింగ్ మిషన్ ద్వారా ఏడు రంధ్రాలు చేసి, చోరీకి యత్నించారు. ఆలయ అర్చకుడు సంతోష్ రోజు మాదిరిగానే శనివారం రాత్రి స్వామివారికి ధూపదీప, నైవేద్యాలు సమర్పించి అనంతరం ఆలయానికి తాళాలు వేసి ఇంటికి వెళాడు. మరుసటి రోజు ఆదివారం ఉగాది పండుగ వేళ ఆలయానికి వచ్చి చూడగా ఆలయ గర్భ గుడి గోడలకు డ్రిల్లింగ్ మిషన్ తో రంధ్రాలు చేసి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సీహెచ్‌సీ ఏర్పాటయ్యేనా..!

- మండలం ఏర్పడి తొమ్మిదేళ్లు..
- జబ్బు చేస్తే ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పెద్దవంగరలో కొనసాగుతున్న పల్లె దవాఖాన

పెద్దవంగర: ప్రజా ఆరోగ్యంలో అత్యంత కీలకమైన వాటిలో ఒకటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. ప్రజలు అనారోగ్యం బారిన పడినప్పుడు వైద్య సేవలు అందించేందుకు, వ్యాధుల బారి నుంచి కాపాడేందుకు పీహెచ్‌సీలు ఎంతో భరోసానిస్తాయి. గ్రామీణ పేద ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాణవాయువు వంటిది. ఇది ప్రాథమిక వైద్య సేవలు అందించడమే కాకుండా ప్రజారోగ్యంపైకీలక పాత్ర పోషిస్తుంది. అయినప్పటికీ నేటి వరకు పెద్దవంగర మండలంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయలేదు. గతంలో ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని భావించిన అది అందుబాటులోకి రాలేదు.

పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజనలో భాగంగా మహబూబాబాద్ జిల్లాలోని పెద్దవంగర గ్రామం కొత్త మండలంగా 10 గ్రామాలతో 2016లో ఏర్పడింది. పాత గ్రామపంచాయతీలకు తోడు మరో 16 నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం 26 గ్రామ పంచాయతీలకు చేరింది. పెద్దవంగరను మండల కేంద్రంగా ఏర్పాటు చేయగా అనేక వసతులు, సౌకర్యాలు చేకూరి ఇబ్బందులు తొలుగుతాయని మండల వాసులు భావించారు. కానీ తొమ్మిదేళ్లు గడిచినా సౌకర్యాలు ఏమీ లేవని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తున్నా..

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుంది. ఇటీవల పెద్దవంగర మండల సమస్యలు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు నిధుల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.
- యశస్వినిరెడ్డి, ఎమ్మెల్యే


ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు..

జనగామ జిల్లా కొడకండ్ల మండలం నుంచి 7గ్రామాలు, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నుంచి 3గ్రామాలతో నాడు నూతనంగా పెద్దవంగర మండలంగా ఏర్పడింది. మండలం ఏర్పడ్డాక ఆ పరిస్థితిల్లో మార్పు వచ్చింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కాక పోవడంతో మండల ప్రజలు తొర్రూరు, వరంగల్, హన్మకొండ, ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

దాతలు 1200 గజాల భూమి వితరణ

గతేడాది మార్చి 5, 2024లో ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టి పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.1.43కోట్ల నిధులు మంజూరు చేసింది. అధికారులు స్థల సేకరణ చేయకపోవడంతో ముందుకు కదలలేకపోయింది. దాతలు గతంలో ఎకరం 20గుంటలు తహసీల్దార్ కార్యాలయానికి అందజేసిన విషయం తెలిసిందే. కాగా ప్రజా సంక్షేమం కోసం వారే 1200 గజాల భూమిని వితరణ చేసినట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చొరవ చూపి ప్రజల ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..



పెద్దవంగరలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఆస్పత్రి ఏర్పాటుకు జాప్యం జరిగింది. దాతలు ముందుకొచ్చి 12వందల గజాల స్థలంను ఇచ్చారు. గతంలోనే నిధులు మంజూరు కాగా ప్రక్రియను చేపడుతున్నాం. టెండర్‌కు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. పూర్తి కాగానే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తాం. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆస్పత్రి నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు.
- గుండాల మురళీధర్, జిల్లా వైద్యాధికారి

ఘనంగా కొండలమ్మ జాతర



కొండలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, తదితరులు

గార్ల: మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామ సమీపంలోని కొండలమ్మ దేవాలయంలో ఆదివారం వందలాది మంది భక్తులు దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి పారవశ్యం పొందారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య పార్టీ నాయకులతో కలిసి కొండలమ్మ దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీఏటా ఉగాది పర్వదినం రోజు కొండలమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ కమిటీ చైర్మన్ నరాల బూర్ల మల్లేశంగౌడ్ అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రవికుమార్, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, భూక్యా నాగేశ్వరరావు, జాటోత్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



మహబూబాబాద్ రూరల్: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మాధవాపురం గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకుడు మద్ది వెంకటరెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంటు అంజయ్య, పాపిరెడ్డి, చిన్న రామిరెడ్డి, ఎర్రబెల్లి చంద్రయ్య, బాబురెడ్డి, బంటు సురేష్ పాల్గొన్నారు.

కురవి: సీసీ రోడ్లతో తండాలు అభివృద్ధి చెందుతాయని నారాయణపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేశ్‌నాయక్ అన్నారు. ఆదివారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో నారాయణపురం పరిధిలోని పాత తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో భద్రునాయక్, భూక్య మోతీలాల్, భూక్య వెంకన్న, బానోత్ దేవిలాల్, బీముడు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ వసంత నవరాత్రి వేడుకలు



సీతారాములను ఊరేగిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, కమిటీ బాధ్యులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో కొలువై ఉన్న సీతారామచంద్రస్వామివారి 67వ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డాక్టర్ ఉమా దంపతులు, ఉత్సవ కమిటీ బాధ్యులు చొడవరపు మోహన్ రావు, ఓం నారాయణ లోయ, పల్లపోతుల లక్ష్మీనారాయణ, డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, పద్మం ప్రవీణ్ కుమార్ తదితరులు రాములోరికి పూజలు నిర్వహించి, రథం లాగి ఊరేగింపు ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ గుడి రాధాకృష్ణమూర్తి, ఆలయ ప్రధానార్చకులు ఎంవీ కృష్ణప్రసాద్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఊరె గురునాథరావు, ఎడ్ల రమేశ్, ఎన్వీ నాగేశ్వరరావు, నాళ్ల లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

ఊరూరా ఉగాది వేడుకలు

విశ్వావసు తెలుగు సంవత్సరాది ఉగాదిని ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో ప్రజలు ఉగాది పచ్చడి తాగారు. ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ప్రజలు రాశీ ఫలాలను పండితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటల్లో సిరులు కురిపిస్తాయని, అన్నిరంగాల ప్రజలకు ఆదాయ వనరులు సమృద్ధిగా లభిస్తాయని, అర్చకులు పంచాంగ శ్రవణంను క్షుణ్ణంగా ప్రజలకు వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: పంచాంగ శ్రవణం చేస్తున్న పండితుడు రాధాకృష్ణమూర్తి



మహబూబాబాద్ అర్బన్: ఉగాది పంచాంగ వేడుకల్లో బీజేపీ నాయకులు



తొర్రూరు: సంగమేశ్వరాలయంలో..



గార్ల: లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో..



చిన్నగూడూరు: రామాలయంలో పంచాంగ శ్రవణం..



నెల్లికుదురు: రామలింగేశ్వర స్వామి ఆలయంలో..



గూడూరు శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో..

అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి



మాట్లాడుతున్న మారగాని బాలకృష్ణ

మరిపెడ రూరల్: అధికారుల నిర్లక్ష్యంతో స్వచ్ఛ భారత్ నిధులు ప్రభుత్వం మళ్లీ వెనక్కి తీసుకుందని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ఆరోపించారు. మండలంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలు అవగాహన కల్పించక, అధికారులు అలసత్వం కారణంగా నిధులు వినియోగించుకోకపోవడంతో ఈ పథకం కింద వచ్చిన కోట్ల రూపాయల నిధులు పంచాయతీ రాజ్ స్టేట్ అకౌంట్ ఆఫీస్‌కి తిరిగి జమ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజాపాలనపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల పరిషత్ అధికారులపై చర్యలు తీసుకుని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించి, నిధులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకన్న, నారాయణ, అంజి పాల్గొన్నారు.

సహజ పానీయాలే ఆరోగ్యానికి మేలు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్: సహజపానీయాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని, శీతల పానియాలు తాగడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నెహ్రూసెంటర్‌లో శీతల పానీయాలు వద్దు–సహజ పానీయాలే ముద్దు అనే కార్యక్రమాన్ని నిర్వహించి సహజ పానీయాలను పంపిణీ చేశారు. అనంతరం కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నెహ్రు రాథోడ్, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, మంగపతి రావు, సురేష్ పాల్గొన్నారు.

సోమ్లాతండాలో భోగ్ బండారో

మహబూబాబాద్ రూరల్: మండలంలోని సోమ్లా తండాలో శ్రీఅమర్ సింగ్ మహారాజ్ భోగ్ బండారో పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, డాక్టర్ ఉమా దంపతులు హాజరై భోగ్ బండారో సమర్పించారు. కార్యక్రమంలో రామచందర్, ఇస్లావత్ బాలాజీ, భూక్య దళ్ సింగ్, సందీప్ పాల్గొన్నారు.

సమాజ వికాసానికి దోహద పడాలి



మహబూబాబాద్: కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్: శ్రీవిశ్వావసు నామ ఉగాది నూతన సంవత్సరం సమాజ వికాసానికి దోహదపడాలని శుభోదయం సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్యాంక్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన సంవత్సరం సమాజంలో రుగ్మతలు, నిర్మూలించబడి, ప్రేమ, అభిమానం, మానవత్వం పెరిగి సమాజం అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కీర్తనారెడ్డి, వెంకటరెడ్డి, గుర్రం సత్యనారాయణ, వెంకయ్య, శ్రవిక పాల్గొన్నారు.

రోడ్ల పక్కనే చికెన్ వ్యర్థాలు



కెనాల్ దాటగానే రోడ్డు పక్కన వేసిన చికెన్ వ్యర్థాలు

మహబూబాబాద్: కొంత మంది చికెన్ షాపు నిర్వాహకులు రోడ్ల పక్కనే చికెన్ వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం శివారు తాళ్ల పూసపల్లి రోడ్డులో వడ్డెర కాలనీ దాటగానే ఉన్న మామిడి తోటనుంచి పాల కేంద్రం వరకు రోడ్ల పక్కన కొంత మంది చికెన్ షాపుల నిర్వాహకులు చికెన్ వ్యర్థాలు పడేస్తున్నారు. వాటి నుంచి వచ్చే దుర్వాసనతో రోడ్డు ద్వారా వెళ్లే వారు, ఆ ప్రాంతాలలో నివాసం ఉండే వారు ఇబ్బందులు పడుతున్నారు. వాటి వలన రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టు తిరుగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రంగా మారి పందులు స్వైరవిహారం చేస్తున్నాయని వాపోతున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి చికెన్ వ్యర్థాలను రోడ్ల పక్కన వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏప్రిల్ 6న శ్రీరామ నవమిని పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10గంటలకు ఆలయ పూజారి వేణుగోపాలాచార్యులు శ్రీరాముడు, సీత, ఆంజనేయస్వామి ఉత్సవాలను ప్రతిష్ఠించి నిత్యపూజలు చేశారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

బయ్యారం: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బయ్యారం మండల కేంద్రంలో ఆటోడ్రైవర్లు ప్రయాణికులకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు యాకూబ్, వర్దయ్య, వీరన్న, వెంకన్న, రవి, దామోదర్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికల విడుదల



మహబూబాబాద్ రూరల్: తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని హనుమంతుని గడ్డ హనుమాన్ ఆలయంలో ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో జరిగిన పూజల సందర్భంగా ఏప్రిల్ 6వ తేదీన జరిగే సీతారామచంద్రుల వారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు.

డాడీ.. ఇంటికెప్పుడొస్తావ్..

- ప్రమాదంలో తండ్రి తలకు బలమైన గాయం
- బ్రెయిన్ డెడ్‌తో ఆస్పత్రిలో చికిత్స
- పండుగపూట తండ్రి వద్ద చిన్నారుల కన్నీరు



ఆస్పత్రిలో ఉన్న తండ్రికి ముద్దు పెడుతున్న చిన్నారులు

నెహ్రూసెంటర్: ప్రమాదంలో తలకు బలమైన గాయం కాగా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కన్న తండ్రిని చూసి పిల్లలిద్దరు కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. అమనగల్ గ్రామానికి చెందిన శ్రీశైలం ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీయూ విభాగంలో ఆక్సిజన్‌పై చికిత్స పొందుతున్నాడు. కాగా ఉగాది పండుగ వేళ పిల్లలు గిరివర్ధిని, రిషీ ఇద్దరు ఆస్పత్రికి వచ్చిన అచేతన స్థితిలో ఉన్న తండ్రికి ముద్దు పెట్టి, లవ్‌యూ డాడి ఇంటికెప్పుడొస్తావంటూ పిల్లల పడిన ఆవేదన చూపరులను కలిచివేసింది. కాగా తలకు బలమైన గాయం కారణంగా బ్రెయిన్ డెడ్ అయినట్లు తెలిసింది.

అందంలో నువ్వా.. నేనా..!



అద్దంలో చూసుకుని మురిసిపోతున్న పిచ్చుకలు

కొత్తగూడ: అద్దంలో తమను తాము చూసుకుని అందంగా ఉన్నామని మురిసి పోవడం మానవ సహజం.. కాని పక్షులుసైతం తమ అందాన్ని అద్దంలో చూసుకుని మురిసి పోవడం ఎవరైనా చూశారా? మండలంలోని వేలుబెల్లిలో ఆగి ఉన్న టాటా మ్యాజిక్ వాహన అద్దంపై పిచ్చుకలు వాలి తమను తాము చూసుకుంటూ అందంలో నువ్వా నేనా అన్నట్లు ఆనందంగా ఎగురుతూ అద్దాన్ని పొడుస్తూ ఉన్న దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

మద్యం సీసాలు ధ్వంసం చేసిన మహిళలు



కొత్తగూడ: మద్యం విక్రయాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మహిళలు మద్యం సీసాలు ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని వేలుబెల్లిలో ఆదివారం జరిగింది. మహిళలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో బెల్ట్ షాపులను నిర్వహిస్తు విచ్చల విడిగా మద్యం విక్రయిస్తున్నారు. తమ భర్తలు సాయంత్రం అయిందంటే కూలి డబ్బులు తీసుకుని బెల్టుషాపుకే వెళ్తున్నారని, ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పలుమార్లు బెల్టు షాపుల నిర్వాహకులకు, గ్రామపెద్దలకు తెలిపారు. అయినా మద్యం విక్రయాలు ఆపకపోవడంతో గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులంతా ఏకమై బెల్టు షాపుల్లో సోదాలు చేసి దొరికిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేశాం.